## ఇక ఓటరు వంతు..!

రేపు ప్రచారం ఆఖరు ● ఈనెల 30న ఎన్నికలు

● డిసెంబర్ 3న ఫలితాలు

సిటీబ్యూరో : ఎన్నికల ప్రచారం రేపు సాయంత్రం ముగుస్తుంది. అభ్యర్థులు చివరి అస్త్రంగా ఇంటింటి ప్రచారం, బైక్ ర్యాలీలు, రోడ్డు షోలకు ప్రణాళికలు చేసుకున్నారు. కేవలం నేడు, రేపు రెండు రోజులే ప్రచారానికి సమయం ఉండటంతో డివిజన్ల వారీగా ఎక్కడి వారు అక్కడే ప్రచారంలో వేగం పెంచారు. కార్యకర్తలు గ్రూపులుగా విడిపోయి గల్లీగల్లీకి తిరుగుతున్నారు. షాపులు, దుకాణాలలో కరపత్రాలు పంచుతూ.. ఓటు అభ్యర్థిస్తున్నారు. కాగా, ఎన్నికల ప్రచారం రేపటితో ముగియడంతో ఇక ఓటరు వంతు వచ్చింది. ఇన్ని రోజులు అన్ని పార్టీల మ్యానిఫెస్టో, నాయకుల ప్రసంగాలు, పార్టీల తీరుతెన్నులు పరిశీలించిన ఓటర్లు.. ఏ పార్టీకి ఓటు వేయాలో నిర్ణయించుకునే సమయం ఇది. వారి తీర్పు ఎలా ఉండబోతుందోనని పలు సర్వేలు, మేధావులు ఇప్పటికే జోష్యం చెప్పారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఓటర్ల తమ విలువైన ఓటును వినియోగించుకోనున్నారు. ఆ రోజు ఈవీఎంలలో వారి తీర్పు భద్రపరిచిన అనంతరం.. డిసెంబర్ 3న ఫలితాలు ఉంటాయి.

## మొదలైన ప్రలోభాల పర్వం

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారానికి మరో రెండు రోజుల్లో తెరపడుతుండటంతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రాజకీయ పార్టీలు పనులు మొదలు పెట్టాయి. దీంతో ఎన్నికల అధికారులు నిఘాను పెంచారు. ఓట్లను కొనేందుకు డబ్బు, మద్యంతో ఎరవేసేందుకు ఆయా పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి డబ్బు, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చెక్ పోస్టులతో పోలీసులు నిఘాను కొనసాగిస్తూ వస్తున్నారు. ఎక్కడికక్కడే చెక్ పోస్టులు ఏర్పాటు చేసి.. తనిఖీలు చేపట్టారు. అయినా, కొందరు రాజకీయ నేతలు కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. ఓటింగ్‌కు నాలుగు రోజులు ఉండగానే ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఓటర్లకు ఎరవేయడం మొదలు పెట్టాయి. ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నాయకులు డబ్బులు పంచుతూ అడ్డంగా దొరికిపోయారు. ఈ నేపథ్యంలోనే నగర పోలీసులు అప్రమత్తమయ్యారు.

## విజనరీ కలిగిన నేత సీఎం కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది కృష్ణ

ఖైరతాబాద్, నవంబర్ 26 : ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విజనరీ కలిగిన నేత అని జమ్మూ కశ్మీర్ నేషనల్ ఫ్యాంథర్స్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది కేఎస్ కృష్ణ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రంలో అల్లర్లు, మతకల్లోలాలు, గొడవలు జరుగలేదన్నారు. గుండాయిజం అనేది పూర్తిగా సమసిపోయిందన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ నాయకత్వం వల్లే సాధ్యమైందన్నారు. సంక్షేమ పథకాలు ముందుకు సాగి ప్రతి ఒక్కరికీ ఆ ఫలాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు తీసుకోవాలన్నారు. 30న జరిగే పోలింగ్‌లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేయాలని తమ పార్టీ తరపున ప్రజలను కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు డాక్టర్ వరదరాజ్, ఎన్‌సీహెచ్ శ్రీధర్, వినాయక్, ప్రేమ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



పూలమ్మినా.. పాలమ్మినా.. కష్టపడ్డ..అన్నది మంత్రి మల్లారెడ్డి ప్రతి చోట చెప్పే మాట.. ఆయనకు పాలమ్మిన రోజుల గురించి చెప్పుకోవడం ఎంతో ఇష్టం. ఆయన ఇష్టాన్ని గుర్తించిన స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల సైకిల్ బహూకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మేడ్చల్ పట్టణంలోని అత్వెల్లికి మల్లారెడ్డి ఎన్నికల ప్రచారం భాగంగా విచ్చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, ఆయన అభిమానాలు తమ అభిమానానికి గుర్తుగా ప్రత్యేకంగా పాల క్యాన్‌తో ఉన్న సైకిల్‌ను బహూకరించారు.

– మేడ్చల్, నవంబర్ 26

# కూకట్‌పల్లిలో బీజేపీ సభ అట్టర్‌ఫ్లాప్

- సభలో జనంలేక.. ముఖం చాటేసిన అమిత్‌షా
- సభలో కుర్చీలు విరగొట్టి.. బారీకేడ్లు పడగొట్టి.. కార్యకర్తల నిరసన



కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 26 : కూకట్‌పల్లిలో బీజేపీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హాజరైన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. బీజేపీ, జనసేన పొత్తులో భాగంగా కూకట్‌పల్లిలో జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ బరిలో నిలిచారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి మెట్రో ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన భారీ బహిరంగ సభకు బీజేపీ, జనసేన పార్టీల నేతలు పరువు దక్కించుకునేందుకు ఆయా ప్రాంతాల నుంచి డబ్బులు వెచ్చించి జన సమీకరణ చేసినప్పటికీ.. ఆ ప్రాంగణంలో కనీసం కుర్చీలు కూడా నింపలేని పరిస్థితి నెలకొంది. సినీనటుడైన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను చూసేందుకు జనాలు వస్తారని భావించారు. అయినా.. సభలో కనీసమైన జనాలు కనిపించలేదు. జన సమీకరణ లేదని.. వస్తే పరువు పోతుందని తెలుసుకున్న బీజేపీ అధినేత అమిత్‌షా అకస్మాత్తుగా సభకు రావడం లేదని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు సభాప్రాంగణంలోని కుర్చీలను విరగొట్టి.. బారీకేడ్లను పడగొట్టి నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్, జేపీ నడ్డా మాట్లాడినా.. వారి మాటలు పట్టించుకోకుండా సభాప్రాంగణం నుంచి వారంతా వెళ్లిపోయారు. జాతీయ నాయకులు, సినీ గ్లామర్‌ను ఉపయోగించి బహిరంగ సభను విజయవంతం చేద్దామనుకున్న జనసేన అభ్యర్థికి ఎన్నికలకు రెండ్రోజుల ముందే ఓటమి ఖాయమని తెలిసిపోయింది. గెలుపు సంగతి దేవుడెరుగు.. కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా.. కనీసం డిపాజిట్ అయినా దక్కుతుందా.. అని పక్కనున్న బీజేపీ, జనసేన నేతలతో వాపోయినట్లు తెలిసింది.

# కాంగ్రెస్‌వన్నీ చీప్ ట్రిక్కులే

- ఉప్పల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి
- గ్యారంటీ కార్డులపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు


మాట్లాడుతున్న రావుల శ్రీధర్‌రెడ్డి

కాప్రా, నవంబర్ 26: ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఖాయమని తెలిసి, ఆ పార్టీ చీప్ ట్రిక్కులకు పాల్పడుతోందని ఉప్పల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి దుయ్యబట్టారు. ఆదివారం సైనిక్‌పురిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఏటీఎం కార్డు మాదిరిగా.. గ్యారంటీ కార్డు పేరుతో కార్డులను తయారు చేసిందన్నారు. ఆ కార్డులపై పింఛన్ ఇస్తామని చెబుతూ ప్రజలకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. తీసుకున్న కార్డులను తిరిగి ఇస్తే డబ్బు ఇస్తామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రూ.50 లక్షలు లంచం ఇస్తూ దొరికిపోయిన దొంగ.. అని, ఆయన ఇలాంటి పనులనే చేస్తారని మండిపడ్డారు. ఓటర్లను మభ్య పెడుతూ.. చేపడుతున్న గ్యారంటీ కార్డుల పంపిణీపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### అవన్నీ బోగస్ కార్డులే..

గ్యారంటీ కార్డులని కాంగ్రెస్ పంచేవన్నీ బోగస్ కార్డులనీ, దీనిపై సంబంధిత అధికారులు, పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని, ఎలక్షన్ కమిషన్ కూడా చర్యలు తీసుకోవాలని రావుల శ్రీధర్‌రెడ్డి కోరారు. రైతు బంధు ఇవ్వొద్దని కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే.. నిజాలు గ్రహించిన ఎలక్షన్ కమిషన్ రైతు బంధు ఆన్ గోయింగ్ ప్రోగ్రామ్‌గా భావించి రైతులకు పంపిణీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు కొత్తరామారావు, పావనీ మణిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఓటర్లకు డబ్బులు పంచుతూ.. దొరికిన బీజేపీ నేతలు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్ డివిజన్‌లోని విఠల్‌వాడిలో ఓ ఇంటి గేటుకు టు లేట్ బోర్డు పెట్టి ఎవరికీ అనుమానం రాకుండా ఓటర్లకు డబ్బులు పంచేందుకు బీజేపీ నాయకులు రంగంలోకి దిగారు. ఖైరతాబాద్ బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి తరపున ఆదివారం విఠల్‌వాడిలో బీజేపీ నేతలు అమర్‌నాథ్, వెంకట్ డబ్బులు పంచుతున్నట్లు సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు జి.రామన్ గౌడ్, జైస్వాల్ తో పాటు మరికొంతమంది అక్కడికి వెళ్లారు. వీరిని గమనించిన అమర్‌నాథ్, వెంకట్ అక్కడి నుంచి పారిపోతుండగా.. అమర్‌నాథ్‌ను బీఆర్ఎస్ నేతలు పట్టుకుని అతడి వద్ద నుంచి రూ.18,500 నగదు, ఓ డైరీని తీసుకుని నారాయణగూడ పోలీసులకు సమాచారం అందించారు. అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. బీఆర్ఎస్ నేతలు పట్టుకున్న రూ.18,500 నగదు, డైరీని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఎస్సైకి అప్పగించారు. వెంకట్ తప్పించుకుని అక్కడి నుంచి పారి పోయాడు. తాము డబ్బులు పంచలేదని బీజేపీ నాయకులు బుకాయించడం గమనార్హం. ఇదిలా ఉండగా, బీజేపీ నాయకులు కూడా ఫిర్యాదు చేయడంతో బీఆర్ఎస్ నేతలు రామన్‌గౌడ్, జైస్వాల్‌తో పాటు మరో ఇద్దరికి 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్, సుల్తాన్‌బజార్ ఏసీపీ బాల గంగిరెడ్డి నారాయణగూడ పీస్‌కు చేరుకుని సీఐ చంద్రశేఖర్‌తో కలిసి విచారణ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేసిన పరస్పరం ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

## సాధారణ ప్రసవాలే శ్రేయస్కరం

*సినీనటి కాజల్ అగర్వాల్*

శేరిలింగంపల్లి, నవంబర్ 26: ప్రస్తుత సమాజంలో ప్రసవం అంటే సిజేరియన్ అంటున్నారని, వాటి కంటే సాధారణ ప్రసవాలే మేలు అని ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ అన్నారు. గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో కిమ్స్ కడల్స్ దవాఖాన ఆధ్వర్యంలో ''మిసెస్ మమ్'' ఏడో సీజన్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గర్భిణీ స్త్రీలకు మాతృత్వం అనేది ఒక మధురానుభూతి అని అన్నారు. గర్భిణి అయిన భార్యను కంటికిరెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత భర్తపై ఉందన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి గ్రాడ్ ఫినాలేకు చేరుకున్న 40 జంటలను ఈ సందర్భంగా అభినందించారు. కిమ్స్ కడల్స్ డాక్టర్ శిల్పారెడ్డి, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బీకే స్వామినాథన్, ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ దుర్గారావుతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


కిమ్స్ కడల్స్ దవాఖాన ఆధ్వర్యంలో మిసెస్ మమ్ ఏడో సీజన్ గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో ప్రముఖ నటి కాజల్ అగర్వాల్

# రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..

*నవ భారత సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం*

సిటీబ్యూరో, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవ భారత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులతో రాజ్యాంగాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు సి.బాబు, సంఘం ప్రతినిధులు ఆర్.బాలకిషన్, జి.వినయ్‌కుమార్, వై.జశ్వంత్‌కుమార్, ఎం.మహేశ్‌బాబు, గౌతం తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మిత్ర కృష్ణ, సంఘం సభ్యులు